
# శివస్వాతి

వాకాటి పాండురంగారావు



సాయం సమయం.

వసుధ వరండాలో ప్రేము కుర్చీలో చేరగిలబడి కూర్చుని వుంది. ప్రక్కన స్టీలుగ్లాసులో చిక్కటి కాఫీ కమ్మగా పొగలుకక్కుతూ వుంది. కొద్దికొద్దిగా నోట్లోకి తీసుకుని ఆ వేడి, ఆ ఘుమ ఘుమ అనుభవిస్తూ తాగుతూంది ఆమె. కాళ్ళదగ్గర సీజర్ పడుకుని వుంది. తోక కూడా కదలడంలేదు. యోగనిద్ర కాబోలు....

వసుధ కళ్ళు వరండా నానుకునివున్న విరజాజితో మీదకు వెళ్ళాయి. ఏదో తెలియని ఆనందానికి ఒడలంతా పులకరించినట్లు ఆ తీగెనిండా తళుక్కుమంటున్న తెలతెల్లటి మొగ్గలు. కొవదేరినమొగ్గలు, అరవిచ్చిన లేలేత ఎరుపు మొగ్గలు.

'శరచ్చాంపేయ పుష్పాభ నాసికాయై –':

శరత్కాలపు సంపెంగ మొగ్గవంటి నాసిక కలదానా–అని శ్రీలలిత వర్ణనలలో ఒక నామం. అదెంత అందమైన ముక్కో....ఎంతందమైన రూపమో.

అల్లాంటి అందమైన నాసికమీదటా, 'తారాకాంతి తిరస్కారి నాసాభరణం'ట: నక్షత్రాన్ని వెక్కిరించే ముక్కు పుడక:

ఓహో, ఎంత గొప్ప ఊహ....

ఊహేనా–?

"ఎవరు నేర్పేరమ్మ ఈ కొమ్మకూ
పూలిమ్మనీ రెమ్మ రెమ్మకూ –"

— ఆల్కెమీ తెలిసిన కృష్ణశాస్త్రి గీతాన్ని సుశీల కాబోలు పాడుతోంది.

ప్రకృతి రమణీయతను పొందికగా పదాలలో పొదిగిన కవిత – ఆ కవితను మధురంగా పాడిన ఆ స్వరం–ఆ గానం పంచిన ఆనందం– ఇదంతా ఒక విరాట్ స్వరూపానికి అవతారాలు కావూ–

వసుధ ముక్కుమీద ఈగ వాలింది. దాన్ని తోలడంతో ఆమె ఆలోచన తెగింది.

పక్కన చూస్తే కాఫీ చల్లారి వుంది.

"మొదట వేడిమీద తాగితేనే కాఫీ రుచి.... ఒకసారి చల్లారినదానిని మళ్ళీ వేడిచేస్తే దాని రుచి తగ్గిపోతుంది–" అని తానంటే రత్నాకర్ ఒప్పుకోలేదు.

"నిజమే! రెండవసారి డైరెక్టుగా స్టవ్‌మీద పెడితే కొద్దిగా రుచి మారుతుంది కానీ, వేరే గిన్నెలో నీళ్ళుకాస్తూ ఆ వేడినీటిమధ్య ఈ కాఫీని వుంచితే – దానికి వేడీ, వాసనా వస్తాయి. సెంట్ పర్సెంట్ గ్యారంటీ!" అన్నాడు. అని అలాచేసి చూపించాడు. నిజమే ఇలాటి వాటిల్లో రత్నాకర్ మాట కొట్టిపారేయడానికి వీలులేదు. సాక్షాత్తుగా నలభీముల వారసుడు.

చల్లారినకాఫీని చేత్తోపట్టుకుని వంటింట్లోకి వెళ్ళింది వసుధ. రత్నాకర్ పద్ధతిలో వేడిచేసుకుంది. మళ్ళీ తాగుతూ ముందుగదిలోకి వచ్చి కూచుంది. రత్నాకర్ స్విమింగ్‌పూల్‌కెళ్ళి చాలా సేపైంది. ఈపాటికి వస్తుండాలి

ఎదుట పుస్తకాల షెల్ఫ్‌మీద నల్లటి ఫినిష్‌లో పేపియర్ మేషీ అర్ధనారీశ్వరుడి విగ్రహం వుంది. దానిని చూడగానే ఆమె పెదవులమీద మొలకనవ్వొకటి మెరిసింది.

ఏడాదిక్రింద తంజావూర్‌లో ఆ సాయంకాలంవేళ బజారు వెంబడి తిరుగుతోంటే "పూంపుహార్" దుకాణం కంటపడింది. ఇద్దరూ లోపలికి నడిచారు.

పేపియర్ మేషీ విగ్రహాలు చాలా అందమైనవెన్నో వున్నాయి. అందులో సరస్వతి విగ్రహం తనకెంతో నచ్చింది. కొందామంది.

"కాదు—ఆ నటరాజుబొమ్మ చూడు, ఎంత బాగుందో-" అన్నాడు రత్నాకర్.

"వీణాపాణి అంటే విద్యకు సంగీతానికి సంకేతం" అని తానంటే - రత్నా "నటరాజు అంటే ఎవరనుకుంటున్నావు? The Lord and master of dance ....నిత్యంలో ఒకభాగమే సంగీతం.... తోంతధిగణతోం ...." అని ఒక చేయి పైకివిసిరి, ఇంకొక చేత్తో ఒక ముద్ర నభినయించాడు, షాపువాళ్ళంతా చూస్తున్నారన్న సంకోచం ఏమీలేకుండా .... అతడంతే: ఎంతటి గంభీరమైన వ్యక్తిత్వమో అంతటి కుర్రతనపు చేష్టలు.

అప్పుడిహా నుదుట గంధంరేఖలు ధరించిన ఆ షాపులోని సేల్స్‌మెన్ సలహాఇచ్చాడు."రెండూదా తీసుకోండిమీ .... టూ హండ్రెడ్ రూపీస్ కూడా కాదు-"

"మా సమస్య అదికాదు కుళందవేలూ! మా డ్రాయింగ్‌రూం షెల్ఫ్‌మీద ఒకటంటే ఒకబొమ్మకే చోటుంది."అన్నాడు రత్నాకర్.

"నా పేరు కుళందవేలు కాదు సామీ, కందసామి——" అని సవరించిన కందస్వామి ఒక్క నిముషం ఆగి, రాజీపథకం క్రింద, ఎక్కడో లోపలినుంచి తీసి చూపించాడు...."ఇందండ—ఈ అర్ధనారీశ్వరుడి బొమ్మను ఎత్తుకోండి .... ఇద్దరికీం దా సరిపోషును—" అన్నాడు.

కుడివైపు అమ్మవారు.

ఎడమవైపు అయ్యవారు.

ఇద్దరూ ఏకశరీరంలో ఇమిడిన ఆ ప్రతిమ చూడడానికి అసహజంగా వుంది.

కానీ....

సహజం అంటే మనకు తెలిసినదీ పరిచయమయినదేనా? అయితే మరి మనకు తెలియనిదంతా?

— తాను రత్నాకేసి చూస్తే అతడు నొసలుముడితో ప్రశ్నించాడు.

తన కళ్ళల్లో ఏంచదివాడో ఏమో కాని— "నిండా బాగుంది కందప్పా... పొట్లం కట్టిసి ఇచ్చుడు .... ఇంక దుడ్డు ఎక్కడ ఇస్తును?" అని ఆ సేల్స్‌మన్ మాటల్ని ఇమిటేట్ చేస్తూ మాట్లాడాడు.

ఆ రాత్రి హోటల్‌గదిలో చెప్పాడు రత్నా. "వసూ: 'వాగర్థా వివసంపృక్తౌ' అన్న కాళిదాసు శ్లోకంచెప్పే, వాక్కు అర్థముకలసిన ఏకరూపానికి ఇది ప్రతిమ. ఆ రెండు సగాలు కలిసిన నిండుదనం తెలియాలంటే, తపన వుండాలి, తపస్సు వుండాలి. పోగొట్టుకున్న సగంకోసం నిరంతరం పరితపించే అర్ధభాగం వేదన నేనెరుగుదును వసూ—నేనెరుగుదునో..." భావానికి మాట ఒక రూపం అయితే శరీరం అంతకన్న నిండైన అర్థం చెప్పగలదని రత్నాకర్ చెప్పిన ఆనాటి - అతడి మాటలు ఈ క్షణాన పలికినట్లున్నాయి.

సగభాగంగా జీవించడం తాలూకు అసమగ్రతా దాని వేదనా తనకు తెలుసు. ఆవేదన తీరిన అనంతమైన క్షణంలోని పరిపూర్ణతా తనకు తెలుసు.

కళ్ళు మూసుకుంది వసుధ.

కాలం వెనక్కు మళ్ళింది.

• • •

పదహారేళ్ళ వసుధ కూచునివుంది మంచంమీద.

మల్లెలమాల లూగుతున్నాయి మంచం చుట్టూ.

కాని మనసునిండా భయాల చింపిరి జుత్తులు, సంశయాల పీలికలు వేలాడుతున్నాయి.

అగరొత్తులు వేడి పొగలను కక్కుతున్నాయి.

ఆ ఉదయం ముహూర్తం వేళ అతడు తనచేయి పట్టుకున్నప్పుడే కంపరమనిపించింది. నీటిబిందెలో ఉంగరం పడేసి వెతకమన్నారు వధూవరులిద్దరినీ. వెతకబోగా—అతడు తన చేయి గిచ్చాడు; చేతిని వెనక్కు తీసేసుకుంది. 'అహా పెళ్ళికూతురు ఓడిపోయిందోచ్'- అంది, ఆయనగారి బంధువర్గంలో ఒక ఇల్లాలుంగారు.

ఎందుకిది, ఏమిటిదంతా, తాను కాలేజి ఎందుకు మానేయాలి. ఈ అర్థంకాని, అవసరంలేని చికాకు కోసం?

గందరగోళంగా వుంది మనసు.

అతడు వచ్చాడు

"సుధా" అని ఎంతో గారాముతో ఆమె చేతిని తనచేతిలోకి తీసుకున్నాడు. ఏవేవో మాటలు పలికాడు, అవేమీ ఆమె చెవికెక్కలేదు.

రెండుచేతుల మధ్య ఆమెను తీసుకోబోయాడు. ఆమె గిరుక్కున కదలి దూరంగా వెళ్ళి నిల్చుంది.

"ఎందుకు సుధా .... కోపమా .... భయమా? ఇటు చూడు. నువ్వంటే నాకెంతో ఇష్టం —" అతడు మళ్ళీ సమీపించాడు.

—అగరొత్తులు పూర్తిగా కాలి బూడిదగా నేలరాలాయి.

ఆమె శరీరమంతా రగిలింది; మనసు నుసిగా మిగిలింది. జడపువ్వులన్నీ చెల్లాచెదరయ్యాయి.

ఆమె లేచింది. నిలబడింది. అద్దంలో తన్ను తాను చూచుకుంది. తన శరీరం మీద ద్వేషం కల్గింది ఏదో ఎత్తునుండి తన్ను క్రిందకు పడదోసినది ఈ శరీరమే—అన్న కోపంతోబాటు ఏడుపూ వచ్చింది .... ఆ మంచంమీద నిద్రపోతున్న ఇంకొక శరీరాన్ని చూస్తే పరమ అసహ్యం వేసింది.

కళ్ళొత్తుకుంది. చీర సర్దుకుంది. పువ్వులన్నీ విదిలించుకుంది. మొహం

తుడుచుకుంది. మనసు ముడుచుకుంది. తలుపు నెమ్మదిగా తెరిచి బయటకు అడుగువేసింది.

పెళ్ళిపనులతో అలసిపోయి అందరూ నిద్రపోతున్నారు. నూతి దగ్గరకు వెళ్ళింది. చేదతో నీళ్ళు తోడుకుని నెత్తిమీంచి పోసుకుంది. పదేపదే పోసుకుంది. పిగమీద నుంచి, భుజాలమీద నుంచి జారి, జాలువారి, కాలువలై పారిన ఆ జలాలతోబాటు తాను క్షాళనం అయినట్లనిపించింది ఆమెకు. కళ్ళమీదనుండి పడుతున్న నీటిధారల కిటికీగుండా ఆకసంలో చంద్రుడు తునాతునకలుగా కన్పించాడు.

బాధాగ్నిగుండంలో కమిలి, కుమిలి, కరిగి ద్రవించిన మనసు జుగుప్సతో గట్టిగా రాయిలా అయింది.

తన గదిలోకి వెళ్ళి తల తుడుచుకుంది. వేరే చీర చుట్టుకుంది.

అప్పుడొచ్చింది అమ్మ.

"ఏంతల్లీ, ఏమయింది?" అని గాభరాగా అడిగింది.

ఆమె ఒక్క నిముషం ఏమీ మాట్లాడకుండా చూచింది. మరునిముషం అమ్మ గుండెలో తలదాచుకుంది. తనకే తెలియదు ఎక్కడనుండి వచ్చిందో అంత ఏడ్పు - "వద్దమ్మా-వద్దు-నాకొద్దు" నివ్వెరపోయిందా తల్లి.

ఆ మరురోజుదయం వసుధకు నూట రెండు డిగ్రీల జ్వరం.

తతంగాలన్నీ ఒక విధంగా ముగించారు. అందరూ ఎవరి దారిని వారు వెళ్ళారు.

"అమ్మాయికి నయమవగానే దిగబెట్టండి_" అంది అత్తగారు.

"వస్తాను సుధా! ఆరోగ్యం జాగ్రత్త-" అన్నాడతడు.

వసుధ కళ్ళయినా తెరవలేదు.

ఆమె ఆరోగ్యం మామూలవడానికి నెల పట్టింది. అయితే ఆమె వారింటికి వెళ్ళనుగాక వెళ్ళను అంది. వాదించారు, రోదించారు, అరిచారు, అప్రతిష్టన్నారు, పాపమన్నారు. కాని భస్తానుగాని వెళ్ళను అంది.

"ఇంకా అమ్మాయి ఆరోగ్యం సర్దుకోలేదంటూ నాన్నగారు వియ్యంకుడికి రాశారు."

"అయితే నేను వచ్చే ఆదివారం వస్తున్నా .... వచ్చి మద్రాసు తీసుకు వెళ్తాను, స్పెషలిస్టుకు చూపిస్తా"నని వుత్తరం రాసిన 'అల్లుడు' రాలేకపోయాడు.

వాళ్ళ వూళ్ళోనే స్టేషన్‌కు ఆలస్యంగా రావడంచేత, కదలిపోతున్న రైలెక్కబోయి, రైలు చక్రాలకు పట్టాలకు మధ్యపడి కన్నుమూశాడతడు.

తల్లిదండ్రులు భోరుమన్నా, అంతా అగమ్యగోచరంగా వున్నా వసుధకు మనసెందుకో తేలికన్పించింది. తన అంతరాంతరాల్లోని మొర ఎలా విన్పించింది? ఎవరికి విన్పించింది? అయ్యోపాపం.... అతగాడు, తనకతడిమీద ద్వేషం ఏమీ లేదే? ఎందుకిదంతా ఇలా జరగాలి! తనెంతవరకు బాధ్యురాలు? తన కేదో కొత్త బిరుదు ఇచ్చారే, అంటే ఏమిటి? తన్ను శాసించడానికి వీళ్ళంతా ఎవరు? మనసును తెలుసుకోలేని, తెలుసుకోవడానికి యత్నించని ఈ మాట్లాడే మరబొమ్మలకు తనమీద హక్కేమిటి?

అన్నయ్య ఒక్కడే నిలబడ్డాడు తన ప్రక్కన.

చాలు! వాడు దేవుడు.

మద్రాసు వెళ్ళింది. హాస్టల్లో వుండి చదువుకుంది. ఎం. ఏ. పూర్తిచేసింది. అడ్వర్టయిజింగ్ & పబ్లిక్ రిలేషన్స్ డిప్లొమా తీసుకుంది. హైదరాబాద్‌లో ఒక అడ్వర్టయిజింగ్ ఏజన్సీలో కాపీ రైటర్‌గా చేరింది.

అక్కడో కాలేజిలో లెక్చరర్ నీల స్నేహితురాలయింది. ఇద్దరూ కలిసి హాస్టల్లో ఒకే గదిలో వుంటున్నారు. నచ్చిన పని, మంచి ఆఫీసు, కావలసినంత జీతం, ఇష్టం వచ్చినట్లు బ్రతకడం– హాయిగా వుంది.

జీవితం మారింది. ప్రపంచం ఒకప్పుడున్నంత ఇరుకుగా చీకటిగా లేదు. తన బంధువర్గం, తన చిన్నవూరు, ఆవూళ్ళో వాళ్ళ ఆలోచనలు _ తలచుకుంటే జాలివేస్తుంది.

కాని.... కొన్నాళ్ళయ్యాక –

లోలోపల .... ఇంతేనా జీవితమంటే అని అడుగుతున్నట్లుగా వెలితిలాటిది మొదలయింది. అది ఫలానా అని తెలియడం లేదుగాని ఎక్కడో ఏదో కలవడంలేదు. వృత్తపు పరిధి ఎక్కడో తెగినట్లు, అంతా పరిధే అయి కేంద్రమే లేనట్లు . . . ఏమిటో తేలని ఒక అపరిపూర్ణతాభావం నల్లటిమబ్బులా పెరుగుతున్నట్లనిపించింది.

ఒకనాడు—

ఒక దుస్తుల ఎగుమతి కంపెనీవారి కోసం అడ్వర్టయిజింగ్ 'కాపీ' రాయాలని కూర్చుంది వసుధ. ఎదుట ఆర్ట్‌వర్క్ డిజైన్‌వుంది. కంపెనీవారి సాహిత్యం వుంది. ఆ ఆర్ట్‌వర్క్‌లోవున్న ఫోటోలో నిల్చుని వున్నాడతను అలవోకగా, ఠీవిగా, ఆ కంపెనీవారి చొక్కా తొడుక్కుని - - వేళ్ళసందున సిగరెట్ కాలుతుండగా –

ఆ కళ్ళల్లోనివి అయస్కాంతాలా!

ఛ.... ఇలా ఫోటోలకు శరీరం అమ్ముకునే వ్యక్తికో వ్యక్తిత్వమా!

తనకే విచిత్రం అన్పించింది. ఒక్కక్షణం ఆరాధించబోయిన మనసు మరుక్షణం అలా క్రిందకోసి కాలరాచిందెందుకని?

– ఆ రోజుకి 'కాపీ' తయారవలేదు.

ఓ పదిరోజుల తర్వాత కాబోలు—

ఉదయం ఆఫీసులో ఎం.డి. గదిలోకి వెళ్ళగానే ఆయన "వసుధా! మీట్ మిస్టర్ రత్నాకర్" అని పరిచయం చేశారు.

ఆ కళ్ళేటు తిరిగాయి. అవే!

"నైస్ టు మీట్ యు—" నిదానంగా, స్పష్టంగా వున్నాయి మాటలు.

తాను అలాటివే ఏవో పలికి బయట పడింది.

— ఇంకోరోజు సాయంత్రం ఏదో పెళ్ళికి వెళ్ళి రాత్రి తొమ్మిదింటికి తాను టాంక్‌బండ్ బస్‌స్టాప్ దగ్గర నిల్చుని వుంది. స్టాపులో ఒక ముసలాయన తప్ప ఇంకెవరూ లేరు. డిసెంబర్ చలివలన కాబోలు రోడ్డంతా నిర్మానుష్యంగానే వుంది.

"గుడీవెనింగ్ మేడమ్—"

తిరిగి చూచింది.

"రత్నాకర్‌ని. ఆ రోజు మీ ఎం.డి. గారి గదిలో—"

"ఎసెస్!" అందిగాని అతడు వెళ్ళిపోతే బాగుండుననిపించింది.

"మీరేమీ అనుకోకపోతే మిమ్మల్ని నా బైక్‌మీద 'డ్రాప్' చేయగలను—"

"నో థాంక్స్!"

"మీ ఇష్టం. తొమ్మిదిన్నరవుతోంది. ఈ వేళప్పుడు బస్సులు సరిగావస్తాయో, రావోనని...." అతగాడి కెందుకట?

"ఫరవాలేదులెండి: వెళ్ళగలను."

మోటార్ బైక్ సడెన్‌గా స్టార్ట్‌చేసుకుని వెళ్ళిపోయాడు.

—వెళ్తానని చెప్పనుకూడా లేదు. బాగా 'హర్ట్' య్యాడేమో.... వాచీ తొమ్మిదీ నలభై చూపించింది. ముసలాయన కూడా లేడు. బస్ రాదనుకుని నడిచివెళ్ళిపోయాడు కాబోలు.

ఆటోలు రయ్‌మని వెళ్తున్నాయి. సినిమా జనాన్ని మోసుకు వెళ్తున్నాయి కాబోలు, ఆగడంలేదు.

వాచీ చూచుకుంది. పదికి పది నిముషాలు.

దేవుడు పంపిన వరంలాగున ఒక్క ఆటోవచ్చి తనదగ్గర ఆగింది.

ఆ వెనకే మోటర్‌బైక్ మీద అతనున్నాడు. "మీ కోసమే తెచ్చాను. వెళ్లండి. అటువైపు ఏవో కత్తిపోట్లు గొడవలు మొదలయ్యాయి. జాగ్రత్తగా వెళ్లండి.... ఇదిగో ఆటో! ఆమె ఎక్కడికి వెళ్ళాలో భద్రంగా తీసుకెళ్ళు—"

ఎక్కి కూచుంది. ఆటో కదిలింది.

దారిమధ్యలో తన వెనకాలే మోటర్ బైక్‌మీద వస్తున్నట్లనిపిస్తే వెనక్కు చూచింది, కాని ఏమీ కనపడలేదు.

హాస్టల్‌దగ్గర దిగి, డబ్బివ్వబోతే ఆటోవాడు — "అయ్యగారు దస్‌రూపాయ్ ఇచ్చిన్రమ్మా—" అన్నాడు.

వసుధకు ఒళ్ళు మండింది.

మరురోజు ఆఫీసుకు వెళ్ళగానే అకవుంట్స్ క్లర్క్ చేతికి పదిరూపాయలిచ్చి అతడి అడ్రసుకు ఎం. ఓ. చేయించింది.

ఇంకోరోజు బంధువులింట్లో పెళ్ళికి వెళ్తూ నీల బలవంతంచేస్తే తనూ వెళ్ళింది.

ఆ తతంగాలు, ప్రదర్శనలు, వేళాకోళాలు, తిండ్లు తనకు నచ్చవు. కాని నీలకోసం వెళ్ళింది. భోజనాల బంతిలో కూర్చోక తప్పిందికాదు. రెండువందల మందికన్న ఎక్కువే కూర్చున్నారు. ఆడామగా ఓ పదిమంది హడావిడిగా వడ్డిస్తున్నారు. వారిలో రత్నాకర్ కన్పించాడు. అతడు తన్ని చూశాడా!

ఏమో—ఇటురాలేదు. మాట్లాడలేదు. అయినా తనకేం బాధ లేదు— అనుకుంది వసుధ.

మరోసారి.

—వేరే కంపెనీవారి వస్తువొకదాని కోసం Campaign తయారుచేయడం కోసం తమ ఆఫీసులో ఎం.డి., విషువలైజర్, అకౌంట్స్ ఎగ్జిక్యూటివ్, తాను చర్చకోసం సమావేశం అయ్యారు. ఆ గ్రూప్‌లో రత్నాకర్ కూడా వుండడం తనకు ఆశ్చర్యం కల్గించింది.

తనేదో 'స్లొగన్' చెబితే, దానిమీద ఎం.డి. అతడికేసి చూచి "మీరేవంటారు రత్నాకర్?" అని అడగడం తనకు చాల చిరాకనిపించింది.

ఒక mere modelని ఇలాంటి intellectual చర్చల్లో పాల్గొననివ్వడమేమిటి?

రత్నాకర్, తాను చెప్పిన స్లోగన్ లోని మేలిఅంశాల నెత్తిచూపించి, ఏ పాయింట్ బలహీనంగా వుందో వివరించి, కొద్ది మార్పులతో దానినే అంతకన్న శక్తివంతంగా రూపొందించేసరికి—తనకు కోపంతోబాటు ఆశ్చర్యం కూడా కల్గింది. 'ఉత్తబాడీ' యే కాదు, 'బ్రెయిన్స్'కూడా వున్నట్లున్నాయి.

— సమావేశం ముగిశాక ఎం. డి. ని విడిగా కలిసినప్పుడు — "సార్! ఆ మోడల్ రత్నాకర్‌ని మన 'డిస్కషన్స్' లోకి రానిస్తారేమిటి?" అని అడిగింది.

ఎం. డి. పాసార్థిగారు నివ్వెరపోయి చూస్తూ — "పిచ్చితల్లీ! నీ కారోజు పూర్తిగా పరిచయం చేయలేదేమో.... రత్నాకర్, సరదాగా నేనడిగితే ఆ షర్ట్‌కి మోడలింగ్‌లో చేశాడు కాని, అతడు ప్రొఫెషనల్ మోడల్ కాడు. He holds an Electromics degree from the states. ఇవాళ మనం 'డిస్కస్' చేసింది ఆయన కంపెనీ ప్రొడక్టే" —

"సారీ సర్!" అని తన గదిలోకి వచ్చింది. ఎందుకు, తనకెందుకీ గొడవంతా—

—ఇంకోసారి, శనివారం సాయంకాలం బిర్లాగుడి కెళ్ళారు తనూ, నీలా. అక్కడ కనుపించాడతను. తన్ను చూశాడు. గుర్తించినట్లు అతడి కళ్ళు చెప్పాయి కాని అతడు మాట్లాడలేదు.

"నమస్కారమండీ!" అని తాననడం తనకే ఆశ్చర్యం కల్పించింది. రెండు చేతులతోనూ నమస్కరించాడు అతడు. నీలను పరిచయంచేసింది.

"మీరు కూడా శనివారాలూ, వెంకటేశ్వరుణ్ని పూజిస్తారన్నమాట—" అని అడిగింది నీల.


"శనివారమే ఉపవాసం వుండితీరాలన్న నియమం ఏదీలేదు. తప్పనిసరిగా ఆలయం వెళ్ళాలనీ వుండదు. వెళ్ళాలనిపించినపుడు వెళ్తానంతే. ఈ ఎత్తు, ఈ శుభ్రత, ఈ వాస్తుశిల్పరీతి ఆహ్లాదకరంగా వుంటాయి." అన్నాడు.

"అదికాదండీ నే నడిగింది.... మీరు అసలు దేవుడున్నాడని నమ్ముతున్నారా, లేదా?" అని నిలదీసింది నీల — మరి లాయర్‌గారి కూతురాయె....

"అదంత సులభంగా చెప్పగల జవాబు కాదు సుమండి .... అలా కూచుందాం రండి ...."

కూర్చున్నారు.

"కనపడేది పదార్థం. ప్రత్యక్షంగా కనపడనిది శక్తి. కాని అవి రెండూ ఒకటేనని నేటి సైన్సు చెబుతూంది. సూక్ష్మాణులోకంలో జరిగే సృష్టి సంహారాలను చూస్తుంటే పదార్థం అనేది శక్తి కెరటాలమధ్య అతి తాత్కాలికంగా వుండే సంబంధం మాత్రమే అని తేలుతుంది. కనుక నమ్మడానికి ప్రమాణం ఏది? ఇంద్రియాలా? లేక వాటి కతీతమయిన ఇంకోటిదేదయినానా?" అంటూ మొదలుపెట్టి క్లాసికల్ ఫిజిక్సు, క్వాంటమ్ మెకానిక్సు చెప్పి, కాంతివేగంకన్న ఎక్కువ వేగంగా సమాచారం అందే ప్రయోగం




వివరించి, సైకాలజీలోకి గెంతి, 'కలెక్టివ్ అన్‌కాన్షస్' గురించి చెప్పి— "నన్ను నేను నమ్ముతున్నాను. అంటే సిల్లీగా వుంటుంది, నమ్మను అంటే అబద్ధం అవుతుంది. కనుక నాలో నేను ఎప్పుడూ వుంటాను అని చెబితే కొంత బాగుంటుందేమో — దేవుడన్నా, శక్తి అన్నా, 'ఇక్' అన్నా 'నేనే' గనుక మల్లెల వాసనను మల్లెలు తెలుసుకుంటాయా, ఆనందిస్తాయా అన్నదానికి జవాబు ఏమిటంటే, మీ ప్రశ్నకు జవాబనే చెప్పాలి. సారీ ఫర్ బోరింగ్ యూ—" అని నవ్వాడు, గాలికెగురుతున్న జుత్తును తోసుకుంటూ.

వసుధ కతడి మాటలన్నీ అర్థం కాలేదు. కాని అత దర్థమయినట్లనిపించింది.

ముగ్గురు కలిసి దిగి, అతడి కోరిక మీద హోటల్‌కెళ్ళి భోజనం చేశారు. వారిని తనకారులో దిగబెట్టాడు.

నెలరోజు లయ్యాక—

ఒక సాయంకాలం గండిపేట చెరువు ఒడ్డున ఏవేవో కబుర్లు చెప్పుకున్నాక, లేవబోతుండగా రత్నాకర్ ఆమెచేయి పట్టి లేపాడు.

ఆ స్పర్శకు వసుధ హాలాహలం సెగ తగిలినట్లు విభ్రాంతురాలయింది.

ఆమె మొహంలోని మార్పు గమనించి ఆశ్చర్యపడ్డా డతడు.

కారులో ఆమె అతడికి తగలకుండా ఎంత ముడుచుకుని కూర్చుందో అతడు అంత జాగ్రత్తగానే వున్నాడు.

నాలుగయిదు వారాల పిమ్మట ఒక రోజు మధ్యాహ్నం, "ఎల్లుండి కారులో మద్రాసు వెళ్తున్నాను, వస్తారా?" అని రత్నాకర్ అడిగితే, అలాగేనంది వసుధ.

దారిపొడుగునా ఎన్ని దృశ్యాలు, ఎన్ని సంఘటనలు, ఎన్ని కబుర్లు....

మహాబలిపురం చేరారు. పల్లవుల రాతి నిర్మాణపు ఆలయాలు, వాటి విమానాల వాస్తుశిల్ప విధానాలు, సముద్రతీర ఆలయ విశిష్టత— —అన్నీ సవివరంగా చెప్పాడతడు.

సాయంకాలం ఆమె, అలలు పాదాలను తడుపుతుండగా ఒడ్డున నిలబడి వుంది. రత్నాకర్ సముద్రంలో ఈతకు దిగాడు. అతడు అలలతోపాటు పడుతూ లేస్తూ, చేపలా కనపడుతూ, కనపడకా అడుకుంటుంటే ఆమెకు భయంవేసింది.

ఈత ముగిశాక వచ్చాడు. ఇద్దరూ తీరంవెంబడే నడుస్తున్నారు. చీకటి పడింది.

కాస్సేపటికి సంద్రంతల్లి కన్న

పండంటి పిల్లాడిలా నవ్వుతూ పున్నమి చంద్రుడు ఉదయించాడు.

అది చూస్తూ వుండిపోయింది వసుధ.

ఆమెను చూస్తూ నిలబడ్డాడు రత్నాకర్.

ఆనందం అర్ణవమై పొంగిపొరలి అఖిలసృష్టినీ అభిషేకించగా — ఈ విశ్వమంతటికీ మిగిలినది వారిద్దరే అన్నట్లుగా వున్నారు.

అన్ని అర్థాలూ ఏకకాలంలో స్ఫురించే ఆ నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ పలికింది వసుధ గొంతు.

"రత్నాకర్!"

"చెప్పు వసూ!"

"కాలం ఈ క్షణందగ్గర నిలిచిపోతే ఎంత బాగుండును!"

అతడి చిరునవ్వు సముద్రపు అల మీద వెన్నెల తళుకులా గనిపించింది వసుధకు.

అతడేమీ పలకలేదు.

ఆ రాత్రి ఎవరిగదుల్లోకి వారెళ్ళి పడుకున్నారు.

ఏ రెండింటికో మెలకువ వచ్చింది వసుధకు.

బీచివైపున్న వరండాలోకి వెళ్ళి కూర్చుంది. ఎందుకో గతమంతా గుర్తుకొచ్చింది. తన మానసికస్థితి తలుపుకొచ్చింది. ఏడుపు వచ్చింది. కట్టలు తెంచుకుని ప్రవహిస్తున్న ఆ ఏడుపుకు 'వసూ!' అన్న రత్నాకర్ పిలుపు అడ్డుకట్టవేసింది.

అతడు తనగదిముందు వరండానుండి పిలిచాడు. అక్కడనుండి ఇసుకలోకి గెంతి, వసుధగది వరండాలోకి వచ్చాడు. ఆమె ప్రక్కగా కుర్చీలో కూర్చున్నాడు. ఆమె చేతికి రుమాలు నిచ్చాడు.

ఏమీ అడగలేదు; ఎందుకని ప్రశ్నించలేదు.

తనే చెప్పింది.

పెళ్ళిచూపుల దగ్గర్నుంచి— అతడలా పోవడందాక, తనకు ఏదేదో అయిపోవడం అన్నీ చెప్పింది. చెప్పి చెప్పి అలసిపోయి చేరగిలబడి కూర్చుంది. ఎదుటినుండి నిర్విరామంగా వినిపిస్తున్న సాగరఘోష ఆమె ఎదకు ప్రతిధ్వనిలా వుంది.

"పిచ్చి వసూ! ఇంతటి బడబాగ్నితో ఎలా వేగావు ఇన్నాళ్ళనుండీ. ...." అని ఓ నిముషమాగి — "వసూ! నేనొకటి అడగనా? నువ్వు 'ఊ' అంటే నీతోబాటే జీవితాంతం అడుగులు వేస్తాను. సాయంకాలం అన్నావే ఆ క్షణాన్ని చిరంజీవిగా చేసుకుని ఆ పందిరికింద కాపురం వుందాం."

"కానీ రత్నాకర్! నన్ను .... నాకు అదికాదు.... నేనూ" — చెప్పలేకపోయింది వసుధ.

"నాకు తెలుసు వసూ! నువ్వు నాదానివయినా నేను నిన్ను తాకను. నన్ను నమ్ము. ఇద్దరం హాయిగా స్నేహితులుగా వుందాం—"

ఇది నిజమా— అని అడిగాయి ఆమె కళ్ళు.

ఔనన్నాయి అతడి చూపులు.

— సింహాద్రి అప్పన్నను చూశాక దంపతులు అరకు వెళ్ళారు. మచ్‌ఖండ్ జలపాత సౌందర్యం ఆస్వాదించాక పూరీ జగన్నాధం దర్శించారు. భువనేశ్వరం ముగించుకుని కోణార్క్ చేరారు.

సూర్యరథం చూశారు. అవతల మైథునశిల్పాలను చూచి ఆమె ముడుచుకుపోతే రత్నాకర్ వివరించాడు.

"జీవితాన్ని దోసిళ్ళనిండా ఎత్తి తాగిన జాతిమాత్రమే సృష్టించగలవీ శిల్పాలు. జీవితానికి నాలుగు గమ్యాలను నిర్ణయించి, అందులో తాము ఒకటిగా గుర్తించి, అన్నిటితోబాటు దానినీ నిండుగా నీతిబద్ధంగా పరిపూర్ణంగా అనుభవించాక, ఈ శరీరపు పరిధినుండి ఎగరడానికి, హారిజాంటల్ ప్లేనులో అత్యంత వేగం పుంజుకున్నాక వర్టికల్ టేకాఫ్‌కు ఒక ప్రయత్నం చేయమని వానప్రస్థం అంటూ ఒక దశను నిర్దేశించిన వివేకవంతమయిన నాగరికత యొక్క యవ్వనపు పండువెన్నెల ఇది. ఈ శిల్పాలను మన ఈనాటి మూసుకుపోయిన దృష్టితో, నీరసపడిపోయిన జవసత్వాలతో మేడిపండులాంటి నీతి కళ్ళద్దాలతో చూస్తే అర్థంకావు. మనిషి అంతరాంతరాల్లోకి వెళ్ళి దర్శించిన ద్రష్టలు సృష్టించిన వ్యవస్థలో శరీరానికి తగు ప్రాధాన్యం ఇచ్చారు. శరీరాన్ని తోసిరాజనలేదు — అలాగని అవసరానికి మించి ఆరాధించనూలేదు. భోగాన్ని యోగాన్ని ఒకే ఏకాగ్రతతో చూచి దానినుండి దానికి క్వాంటమ్ లీప్ చేసిన మహామనుషులు వదలివెళ్ళిన గుర్తులివి—"

కోణార్కనుండి కలకత్తా, బేలూరు, కాశీ, డార్జిలింగ్, ఆగ్రాల తర్వాత ఖజురహో చేరారు.

అక్కడొక శిల్పందగ్గర నిలబడి చెప్పాడు రత్నాకర్. "భోగికాక యోగికాలేడనడానికి ఇవి సాక్ష్యాలు. ఆత్మపరమాత్మల సంయోగానికీ, స్త్రీ పురుష సంయోగానికి సారూప్యం వుందంటే "శివ శివా!" అనిపిస్తుంది. 'బాష్' అనాలనిపిస్తుంది. ఎందుకంటే నరనారీ సంయోగాన్ని మనం దైవత్వానికి దారితీసే సోపానస్థాయి నుండి, జంతుక్రీడస్థాయికి దిగజార్చుకున్నాం గనుక.... తన అర్ధశరీరంతో కలిసి కరిగి ఏకాత్మను పొందగలిగే శక్తిని మనిషికిచ్చేదీ, సృష్టి కార్యక్రమంలో భగవంతుడి ప్రక్కన నిలబడనిచ్చేదీ అయిన ఈ కేళి నిజంగా యోగతుల్యం గనుకనే అన్ని మతాలూ దీనికి కొన్ని నిబంధనల నేర్పరచాయి. ఆ నీతుల వెలుపల కలయికలను గర్హిం

చాయి. ఆ గర్హించడం ఈ కలయిక నికృష్టమైనదని కాదు, ఇంతటి పవిత్రమైన దానిని అధోగతిపాలు చేయరాదని శరీరాన్ని అధిగమించేశక్తిని శరీరానికి బానిసకావడానికి వాడుకోరాదని వాళ్ళు శాసించారు. ఎగరడానికి రెక్కలుకావాలి కాని అవి నడకకు అడ్డొచ్చే బరువులు కాకూడదు కదా!"

"నాకంతా అయోమయంగా వుంది." అంది వసుధ.

"ఔను, అయమంటేనే ఇనుము, ఆ ఇనుపరెక్కల గురించే నే చెప్పింది" అన్నాడు రత్నాకర్. ఆమె కది అర్థం కాలేదు.

ఇలా ఒక్కొక్కప్పుడు, అనుభవం గడుస్తుంటే లోలోపల సహస్రదళ పద్మంలాటిదాని రేక లొక్కొక్కటి విచ్చుకుంటున్నట్లుంది వసుధకు.

ప్రతిరాత్రి ఆమె భయం అబద్ధం అయ్యేది.

అవతల మంచంమీద రత్నాకర్ హాయిగా నిద్రపోయేవాడు.

మళ్ళీ ఊరు చేరారు. హాస్టల్ వదలి మూడునెలలవస్తున్నాయి. అప్పుడప్పుడు నీలవచ్చి వెళ్తుండేది.

"ఉద్యోగం చేయనా, మాననా?" అని అడిగితే – "నీకెలా బాగుంటే అలా చేయి–" అన్నాడు రత్నాకర్.

ఆమె ఇంకా పనిచేస్తూనే వుంది. వసుధకు జీవితం అనంతనీలాకాశంకింద పంటకొచ్చిన చేలు మోస్తన్న చూలాలిలా వుంది.

ఒక ఆదివారం సాయంకాలం నృత్య ప్రదర్శనకు వెళ్ళారు. భార్యాభర్తలయిన సుప్రసిద్ధ నర్తకీనర్తకులు ప్రదర్శించిన ఆనాటి కార్యక్రమం విలక్షణంగా వుండింది.

భామాకలాపం, దశావతారాలు, తరంగం అయింతర్వాత అర్ధనారీశ్వర నృత్యం ప్రకటించారు. తెరముందుకు వచ్చిన నాట్యాచార్యుడు ఆ నృత్య ప్రాధాన్యాన్ని వివరిస్తూ "మందార మాలాకలితాలక శివ, అనగా పార్వతి, కపాలమాలాంకిత కంధరుడు శివుడు. దివ్యాంబర ఆమె; దిగంబరు డాతడు. ప్రపంచ సృష్టికొరకు రసోత్పాదకాలయిన శృంగార ముద్రలను సమ్మోహనంగాపట్టిన లాస్యం శివది; సమస్తమూ సంహారంచేయడానికి మూడవ కన్ను తెరిచిన ఉద్ధవతాండవ నృత్యం శివునిది. ఆమె శివాన్విత: అతడు శివాన్వితుడు. పరస్పర వైరుధ్యాలుగా కన్పించే రెండు మహాశక్తుల ఏకైక చైతన్యాన్ని దృశ్యంగా చూపడమే ఈ నృత్యం యొక్క ధ్యేయం" అన్నాడు.

తెర లేచింది.

'సకల భువనములాంగికముగా' శంకరుడు– 'పదునాల్గు లోకముల నతులితంబైన యద్వైతమే ప్రమోగ"గా శంకరీ, నాట్యం చేయసాగారు.

తకతకిట, తకతకిట, తకతకిట, తకిటతక – నట్టు హంగం, మృదంగం, గాత్రం, నృత్యం కలిసి రసార్ణవమై పొంగసాగింది.

"కనుబొమ్మలో మధురగమనములు
నడయాడ
గనుపాపలో గౌరి కసి నవ్వు బింబింప
రనుచూపులను తరుణ కౌతుకము
జూంబింప
గడగి మూడవకంట గటికవిప్పులురాల"
అయ్య ఆడినది శివతాండవమట!

'ఆడినది గిరికన్నెయల మారుతమట్లు
బాడినది సెల కన్నె పకపకా
నవ్వినట్లు–
–గగనవనమున విచ్చుకొనిన
జలదంబట్లు
వనమునకు బారాడు వాతపోతంబట్లు–
అమ్మ ఆడినది శివాలాస్యంబట.

'ఓహూహూ, యూహాతీతంబీ యానందం బిలాతలంబన్ అన్నట్లు వారొడలు మరచి ఆడుతుంటే ప్రేక్షకు లందరూ హిమాలయాల సానువులమీద కూర్చున్నారు.

జగత్ సృష్టి విలయాలకు సంకేతాలయిన ఆ నర్తనం దృశ్యమై, శ్రవ్యమై, గంధమై, స్పర్శనీయమై, వాచ్యమై – అన్నిటికీ అతీతమై, అందరిలోనూ అణోరణీయానయి, అందరినీ మహతో మహీయానుగా చేసింది ఒక యుగ క్షణ కాలం.

ఆ అనుభవం ముగిసి చప్పట్లతో అందరూ దిగివచ్చేసరికి – వసుధకూడా చప్పట్లు కొట్టబోయింది.

కాని తన కుడిచేయి రత్నాకర్ ఒడిలో వుండటం గమనించింది. రత్నాకర్ ఆర్ద్రీతాదృక్కులలో తడిసిన ఆమె నెమ్మదిగా తనచేతిని వెనక్కితీసుకుంది.

ఆ రాత్రి చాలాసేపు అతడు నాట్యం గురించి చెబుతుంటే వింటూనే నిద్రపోయింది వసుధ. ఆమెమీద దుప్పటి కప్పి తన మంచంమీదికి వచ్చి పడుకున్నాడు.

–దసరాలప్పుడు మైసూరు వెళ్ళారు. అక్కడనుండి మధుర చేరారు.

మధురలో 'ఉద్యద్భాను సహస్రకోటి సదృశ, శివవామభాగనిలయ' అయిన మీనాక్షీదేవి సోమవారపు వజ్రకిరీటాలంకారాన్ని తనివితీర చూశారు.

ఆ కోవెలలో ఒక కోనేరుంది. దానికి 'బంగారు తామరకోనేరని' పేరు. ప్రాచీన కాలంలో కావ్యాలను ఆ నీటిమీద వదలి అవి గనుక తేలితే ఉత్తమ కావ్యంగా పరిగణించేవారట. మునిగినది, మునగదగినదే అనుకునేవారట.

అది విని రత్నాకర్ – "ఈనాటి మన సాహిత్యమణులను గనుక ఆ విధంగా వదలిపెడితే, ఈ కోనేటి నీళ్ళన్నీ లేచి

పారిపోతాయేమో-" నన్నాడు. గలగలమని కావేరిలా నవ్వింది వసుధ.

కోడైకానల్ సిల్వర్ సేక్కేడ్ జలపాతందగ్గర వసుధను ఫోటోతీశాడతడు. కోకర్స్ వాక్ నుండి టెలిస్కోప్ ద్వారా వైగై అనకట్ట చూశారు. మేఘాలచాటు సూర్యోదయాన్ని ముచ్చటగా ఆనందించారు,

అక్కడినుండి కన్యాకుమారి చేరారు.

అడుగుపెట్టగానే ఆ వూళ్ళో ఏదో అలౌకికంగా అన్పించింది వసుధకు. తాము దిగిన హోటల్ ఎదుటే మూడు సముద్రాల సంగమం వుండడం చూచి ఆమె మనసు ఎగిరి గంతేసింది. ఇది నా దేశపు భూభాగపు చివరి భాగం - అనుకుంటే మనసులో ఏవేవో భావాలు పొడసూపాయి. కన్యకుమారి ఆలయం గాంధీ మండపం చూచారు.

ఎగసెగసిపడే ఈ సముద్రాల మధ్య, నిశ్చలంగా ఎత్తుగా ఆ శిల; దీవిలో భాగమయి కూడా, కానట్టుగా కావవచ్చే ఆ శిలపై వివేకానంద మందిరం ! ఇంత సముద్రాన్నీ ఈది, ఆ శిలపై మూడు రోజుల ఏకాగ్రత తర్వాత వివేకానందుడు జ్ఞానోదయం పొందిన పవిత్ర స్థలం.

ఫెర్రీమీద ఎక్కి వసుధ, రత్నాకర్ శిలమీదకు చేరారు. శ్రీపాదశిల, వివేకానందుడి విగ్రహం, ధ్యానమందిరం చూచి పులకించారు. పుస్తకాలు, ఏవో పటాలు కొన్నారు. రెండుమూడు గంటలు తన్మయత్వంలో గడిపారు. భారతీయ ఆత్మ ఇంకా జాగరికంగానే వుంది అన్న భావం వెచ్చగా ఊపిరిలా స్పర్శించే ఆ వాతావరణంలో మౌనంగా గడిపారిద్దరూ.

సాయంకాలం అరవుతోంది. అలల ఉధృతం ఎక్కువవుతోంది. "ఫెర్రీ ఆఖరి ట్రిప్ ఇది - త్వరగా పదండీ, అంటూ వలంటీర్లు తొందరపెట్టసాగారు. యాత్రికులు కిలకిలమంటూ ఫెర్రీవైపు పరుగెత్తసాగారు.

చివరిదాకా వుండిన రత్నాకర్, వసుధ లిద్దరూ పరుగు పరుగున వచ్చి ఫెర్రీలోకి గెంతారు. ఫెర్రీ కదిలింది క్రిక్కిరిసిన ఫెర్రీలో గుమ్మం దగ్గర ఒకరిప్రక్కన ఒకరుగా నిల్చున్నారు వారిద్దరూ.

హోరుమంటూ మోదుతున్నాయి అలలు.

అక్కడినుంచి వెళ్ళడాని కిష్టంలేక వెళ్తున్నట్లుగా ముక్కుతూ మూలుగుతూ తిరిగింది ఫెర్రీ భారత భూభాగం వైపు

చీరకుచ్చిళ్ళు వదులయినట్లనిపిస్తే సర్దుకోబోయింది వసుధ.

విలువెత్తు అలపోటుకు, ఫెర్రీ పైకి ఉయ్యాలవలె లేచి ఒక వైపుకు వంగి ఇంకొకవైపుకు సర్దుకునే లోగా,

పట్టుతప్పిన వసుధ-

'రత్నా' అంటూ

సముద్రంలోకి పడింది.

అయ్యో అయ్యో అని వందలమంది రోదించగా -

ఒక్కక్షణం తనపక్కనుండి మరో క్షణం వసుధ లేకపోవడంతో మెదడు మొద్దుబారినట్లయిన రత్నాకర్ క్షణం ఆలసించకుండా నీటిలోకి దూకగా-

ఫెర్రీ డ్రైవర్ లాఘవంగా ఫెర్రీని ముందుకు నడపగా- భయంకరమైన జలకంపాలలో మునుగుతూ, తేలుతూ ఆ నల్లటినీటి తాండవనృత్యహేలలో దగ్గరవుతూ, దూరమవుతున్న వసుధను చూచుకుంటూ రత్నాకర్ తన అనుభవాన్నంతా వినియోగించి, తనశక్తినంతా కూడగట్టుకుని, తన ప్రాణాన్నే ఒడ్డి, ఈది, అలలుదాటి వసుధ జుత్తునందుకున్నాడు.

ఆమెను లాక్కొని స్మారకశిలవైపు వెళ్ళబోతుండగా ఫెర్రీనుండి విసిరిన 'లైఫ్‌బాయ్' ఎదురయింది.

- దాని నందుకుని ఆమె పొట్టకింద 'బాయ్' నుంచి, తనపక్క కామెను లాక్కొని, కుడిచేతి చుట్టూలో ఆమెను బంధించి, లాక్కుంటూ, ఈదుతూ ఫెర్రీ చేరాడు రత్నాకర్.

ఫెర్రీ పెద్ద ఆశ్చర్యార్థకం అయింది ...

-రాత్రి తొమ్మిదిన్నర గంటలవేళ, హోటల్‌లో మంచంమీద, వెచ్చటి రగ్గులమధ్య పడుకునివుంది ఆమె.

"చాల miraculous అండీ ! ఆమె అంతా నార్మల్‌గా వుంది. నీళ్ళు కక్కించిన తర్వాత నీరసంగా వుందంతే.... నిద్రపోనివ్వండి-" అని డాక్టరు చెప్పివెళ్ళి రెండు గంటలయింది.

రత్నాకర్ ఆమెనే చూస్తూ కూర్చున్నాడు పక్కన కుర్చీలో.

తడిసి ఎండిన ముంగురులు ఫ్యాన్ గాలికి కదలాడుతున్నాయి.

తనే ఆమె నుదుట దిద్దిన కుంకుమ నిర్మలంగా మెరుస్తున్నది.

లేచాడు. పచారు చేశాడు. కూర్చున్నాడు. పదకొండయింది. వసుధ కళ్ళు తెరవలేదింకా.

- అతడు లేచి వరండాలోకి వెళ్ళి నిల్చున్నాడు. దూరాన నల్లగా కనిపిస్తున్న సముద్రాన్ని చూస్తూ.


అంత ఘోషలోనూ -

"రత్నా !" అన్నపిలుపు మెరుపై తాకగా ఒక్క ఉదుటున ఎగిరి, మంచం ప్రక్కన చేరాడు.

ఆమె కళ్ళు తెరిచింది. "రత్నా !" - రగ్గు విదిలించి చేయిజాపింది.

ఆమెచేతిని తన రెండుచేతులమధ్యకు తీసుకున్నాడు రత్నాకర్.

ఆమె లేచి కూచుంది.



ఫ్లాస్క్‌లోంచి వేడిపాలను గ్లాసులో పోసి నోటి కందించాడు.

నెమ్మదిగా తాగింది.

బరువుగా, మత్తుగా, నెమ్మదిగా మంచం అంచుకు జరిగి క్రింద పాదాలు ఆనించబోతే – "వద్దు వద్దు – నీరసంగా వుంటుందేమో" అన్నాడతడు.

నవ్వింది దామె,

లేచి నిలబడింది. ప్రక్కనే నిలబడిన రత్నాకర్ భుజంమీద ఆనుకుని, అడుగు మీద అడుగువేస్తూ నడిచింది. ఇద్దరూ వరండాలోకి వెళ్ళారు.

వాలు పేము కుర్చీలో ఆమెను కూర్చోమన్నాడు.

"నువ్వు కూచో" – అందామె.

అతడు కూచున్నాడు. అతడి ఒడిలోకి ఒదిగి ఒదిగి కూచుందామె.

– కడలి తన చేతుల నాప్యాయంగా పుడమిచుట్టూ అల్లింది. పుడమి పులకరించి కరిగి కడలిలోకి జారిపోతున్నది.

* * *

సైరన్ మోగింది.

వసుధ ప్రస్తుతంలోకి వచ్చింది. ముందు గదినుండి వరండాలోకి వచ్చి నిల్చుంది.

పోర్టికోలోకి రత్నాకర్ కారొచ్చి ఆగింది.

———